# ముత్యమంతా పలుకు

"వెధవా... పన్నెండు రోజుల్నించి సోషల్ పీరియడ్‌లో నీ అటెండెన్స్ లేదట. ఎక్కడ ఆడుతున్నావో చెప్పు... లేకుంటే చంపేస్తాను" తండ్రి కొడుతున్న దెబ్బలకి వీపు వాచిపోతున్నా తండ్రి కోపం చూస్తే అసలు నోటిమాట రావడం లేదు రాకేష్‌కి.

కళ్లవెంట నీళ్లు ధారాపాతమయ్యాయి.

అసహాయ స్థితిలో తల్లి బేలగా చూస్తుండిపోయింది.

ఈ స్థితిలో భర్తని సముదాయించినా ఆయన 'నువ్వే వెనకేసుకొస్తున్నావ్' అని మరింత పెట్రేగిపోతాడు తప్ప ఏ లాభమూ వుండదని ఆమెకు తెలుసు.

రాకేష్ దీనంగా తల్లివైపు చూస్తూ 'నే...నే...నే...నేను' అనేదో చెప్పాలని ప్రయత్నిస్తుంటే తల్లిలో దుఃఖం కట్టలు తెంచుకుని పొంగుకొస్తోంది.

అసలే వాడికి నత్తి వుంది. అందులో తండ్రి కోపం. ఆ తల్లిని బాధపెట్టేది రాకేష్‌లోని నత్తి. ఎంతమంది డాక్టర్లకు చూపించినా ఏ ప్రయత్నమూ ఫలించలేదు. ప్రభుత్వ స్కూల్లో నాలుగో తరగతి చదువుతున్న రాకేష్ కొన్ని విషయాల్లో వెనకబడిపోవడానికి కారణం తనకి వున్న నత్తేనని వాడికి తెలుసు.

అందుకే ఎక్కువగా ఎవరితోనూ మాట్లాడడు. ఒంటరిగా కూచుంటాడు. టీచర్లు కూడా కోపం వచ్చినప్పుడు 'ఒరే నత్తివెధవా' అని తిడితే చిన్నారి గుండె గిలగిలా కొట్టుకునేది.

నిన్న క్లాసురూంలో శ్రీనుగాడు అందరి ఫ్రెండ్స్ ముందర

"ఒరే రాకేష్! నీకో జోక్ చెప్పనా. నీలాంటివాడొకడు రైల్వే స్టేషన్‌కి వెళ్లి బుకింగ్ కౌంటర్‌లో 'తి...తి....తి....తి...తి... తిరుమలకో టిక్కెట్టివ్వండి' అనే సరికి తిరుమల రైలు వచ్చి వెళ్లిపోయిందట" ఫ్రెండ్స్ అంతా గొల్లున నవ్వారు. ఏదో బాధ... కళ్లల్లో సన్నటి నీటిపొరలు.

లంచ్ అవర్‌లో టిఫిన్‌బాక్స్‌లోని అన్నమంతా కుక్కకి పడేశాడు. 'హలో' అని ఎవరైనా పలకరిస్తే వెంటనే 'హలో' అన్లేక నాలుక గిలగిలా కొట్టుకునేది.

ఈ మధ్య నత్తి మరీ ఎక్కువైంది.

స్కూల్ నించి ఇంటికెళ్లగానే బ్యాగు ప్రక్కనపడేసి 'అమ్మా' అని అరచి ఎదురొచ్చే అమ్మ మెడని గట్టిగా చుట్టేసుకోవాలని కోరిక... బలమైన కోరిక.

కానీ 'అమ్మా' అని పిలవడానికి నాలుక వెంటనే సహకరించదు.

సోషల్ పీరియడ్ వచ్చేసరికి మాస్టారు తన రోల్‌నంబర్ 'ఇరవై ఒకటి' అనేసరికి వెంటనే 'ఎస్సార్' అనలేక నాలుక తడబడుతుంటే... అరవై ఎనిమిది మంది విద్యార్థుల్లో తనని గమనించని మాస్టారు 'ఆబ్సెంట్' వేసి తరువాతి రోల్‌నంబర్లు పలుకుతూ పోతాడు. సోషల్ టీచర్ అటెండెన్స్ రిజిష్టర్‌లోనే తలదూరుస్తాడు. మిగతా టీచర్లు తను పలక్కపోయినా తన సీటువైపు చూసి అటెండెన్స్ వేస్తారు. నాన్నకి సోషల్ టీచర్ కలిసి ఏం చెప్పాడో అర్థమయ్యాక... నొప్పి లేస్తున్న ఆ దెబ్బల్ని చూపిస్తూ తల్లిని కరుచుకొని వెక్కి వెక్కి ఏడ్చాడు.

తల్లికి ఏమని ఓదార్చాలో అర్థం కాలేదు.

'ఆ జబ్బు రేపు తగ్గిపోతుంది కన్నా' అని కూడా చెప్పలేని స్థితి. రాత్రి పదకొండు దాటుతున్నా రాకేష్ నిద్రపోలేదు. మనసు నిండా ఆలోచనలు.

'ఎలాగైనా సరే... రేపు సోషల్ పీరియడ్‌లో 'ట్వంటీవన్' అనగానే 'ఎస్సార్' అనాలి. కానీ ఎలా ?

ఎలా? ఎలా?? ఎలా???

రాత్రి రెండు అయినా మంచమ్మీద పొర్లుతూ ఆలోచిస్తున్నాడు. మూగగా రోదిస్తున్న మనసులోంచి ఒక్కసారిగా పరిష్కారం దొరికినట్లయింది. కళ్లు ఆనందాన్ని సంతరించు

కున్నాయి. పెదాలు నవ్వుతూ విచ్చుకున్నాయి.

మంచంమీంచి లేచి 'ఎస్సార్' అన్న పదాన్ని ఉచ్చరించాడు. అది వెంటనే నోట్లోంచి రాలేదు.

'ఎ...ఎ...ఎ...ఎస్సార్'

తను అన్నపదాన్ని పెన్నుతో రాసి ఏవో లెక్కించాడు. గుండెనిండా నవ్వుకున్నాడు. అతిపెద్ద విజయం సాధించిన అనుభూతి ఆ చిన్ని మనసులో...

మర్నాడు

క్లాస్‌రూంలో .... సోషల్ పీరియడ్...

"నైన్‌టీన్"

"ఎస్సార్"

"ట్వంటీ"

"ఎస్సార్"

"ట్వంటీవన్"

"ఎస్సార్"

పిల్లలంతా గబుక్కున రాకేష్‌వైపు తిరిగి చూశారు. మాస్టారు చిత్రంగా తలెగరేసి చూశాడు. రాకేష్‌లో విజయగర్వం నవ్వుతున్న కళ్లతో క్లాసంతా కలియజూశాడు. పిల్లల్లో గుసగుసలు. మాస్టారు మళ్లీ అటెండెన్స్ పిలవడంలో నిమగ్నమయ్యాడు.

క్లాసురూం బయటికొచ్చాక రాకేష్‌కి దగ్గరైన మిత్రుడడిగాడు

"ఒరే రాకేష్... ఈ రోజు నువ్వు సడెన్‌గా 'ఎస్సార్' అని ఎలా అనగలిగావ్?" అని

"ప...ప...పంథొమ్మిదో నంబర్‌నించే ఎ...ఎ...ఎస్సార్ అనడానికి ప్రయత్నించా" రాకేష్ తేలిగ్గా నవ్వుతూ చెప్పేశాడు.

మిత్రుడు నవ్వి, 'ఈ అయిడియా బావుందిరా, పెద్దవుతుంటే నీ నత్తి తగ్గుతుందిలే' అన్నాడు భరోసాగా.

రాకేష్‌కి ఆ మాట ఎంత తృప్తినిచ్చిందంటే.... ఇంటివైపు వేగంగా పరిగెత్తాడు. ఇల్లు దగ్గరపడగానే గుండె గొంతులోంచి లావాలా ఉబికుబికి వస్తున్న "అ..." అనే అక్షరం

చిన్న స్వరంతో...అ...అ...అ... తల్లి కన్పించగానే "అమ్మా..." పెద్దగా అని పెనవేసుకుపోయాడు.

తల్లి క్షణకాలం నిర్ఘాంతపోయింది వాడు సడెన్‌గా పిలిచేసరికి.

"రాకీ... నీ నత్తి తగ్గిపోతోందిరా" అంది ప్రేమగా ముద్దుపెట్టి.

"నిజమమ్మా ?" ఈసారి నిజంగానే సడెన్‌గా అన్నాడు రాకేష్. ఆ వెంటనే తనలోని మార్పుకి ఆశ్చర్యపోయాడు. గుండెల్నిండా పేరుకుంటున్న ఆత్మ బలం తనకే తెలీదు. కానీ... " నీ నత్తి తగ్గిపోతుందిరా"తల్లి, మిత్రుడు అన్న మాటలు రాకేష్ మనసునిండా ఆనందాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపాయి.

* * *